క్లుప్తంగా

నెలాఖరులోపు పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

సత్తెనపల్లి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపుపై ఐదు శాతం రాయితీ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎన్. ఆనంద్ కుమార్ సోమవారం తెలిపారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులతో పాటు నీటి చార్జీలను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో, మీసేవలో లేదా సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా గానీ, పురమిత్ర యాప్ ద్వారా గానీ చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


సత్తెనపల్లి: కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఉదయం 10:30 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ కౌన్సిల్ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ సోమవారం తెలిపారు.పట్టణంలోని బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాలకు చెందిన 288 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా అప్లికేషన్, రేషన్, ఆధార్ కార్డులు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకం ఫొటోస్టాట్ కాపీలు మూడు సెట్లు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

చలివేంద్రాలు ప్రారంభం



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరులో రావిపాటి శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను సోమవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కె. కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర గ్రామస్తులకు, ముఖ్యంగా పేదవారికి ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.రాబోయే రోజుల్లో ట్రస్ట్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ సాయికృష్ణ రావిపాటికి బ్యాంక్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుని మాల ధారణలు ప్రారంభం



బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి మాలధారణలు సోమవారం ప్రారంభమైనట్లు ఈవో అవుడూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 10 వరకు మాలధారణ ఉంటుందని పేర్కొన్నారు. మే 22, 23, 24 తేదీల్లో తిరునాళ్ల వేడుకలు జరుగుతాయని, అర్ధ మండల దీక్షలు ఈ నెలాఖరు నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, అనంతాచార్యులు తెలిపారు. మే 22న హనుమత్ వ్రత దీక్ష విరమణ, ఇరుముడి కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

చోరీ కేసుల్లో జైలు, జరిమానా

నరసరావుపేటటౌన్: : వేర్వేరు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లు దొంగిలించినట్లు నేరం రుజువు అవడంతో నిందితుడు పట్టణంలోని వరవ కట్టకు చెందిన షేక్ అష్రఫ్‌కు ఒక్కొక్క కేసులో మూడు నెలల జైలు శిక్ష, రూ. 1000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టి. ప్రవల్లిక సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడు 2024 సంవత్సరంలో మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవ్వడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువరించారు.

ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం

సత్తెనపల్లి: ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యంపై సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థిని, ఆమె సోదరి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో నివసిస్తుంటారు. ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఇద్దరు బాలికలు తిరిగి రాక పోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల ఆరా తీశారు. ఎక్కడా సమాచారం లభించక పోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందమానందమాయెనే !

- జగనన్న కాలనీల్లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- 18 పంచాయతీల్లో 2,846 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పేదలు కృతజ్ఞతలు

జగనన్న పాలనలో పేదలకు 'గృహ'త్తర భాగ్యం



క్రోసూరులో జగనన్న కాలనీ



దొడ్లేరులో జగనన్నకాలనీ

క్రోసూరు: పేదల ఇళ్లు కావవి.. ఊర్లకు ఊర్లు అన్నట్లు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు నిలువ నీడ దొరికింది. అద్దె ఇంటి భారం తప్పింది. జగనన్న కాలనీల పేరిట సొంతింటి కలన సాకారం చేసింది. ఇళ్ల పట్టాలతో పాటు నిర్మాణానికి నగదును కూడా అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. కాలనీలకు విద్యుత్ సౌకర్యం, వీధి వీధికి బోర్లు, నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేసింది. విశాలమైన రోడ్లతో పాటు మౌలిక వసతులు కల్పించింది. గతంలో ఎన్నడూ, ఎవరూ చేయని విధంగా జగనన్న ప్రభుత్వం లే అవుట్లను అభివృద్ధి చేసింది. దీంతో అనేక మంది ఇళ్లు కట్టుకుని, వాటిలో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

ఇళ్ల మంజూరు ఇలా..

మండలంలో 15 సచివాలయాల పరిధిలో (18 పంచాయతీలకు) జగనన్న కాలనీల్లో 2,846 మందికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఇందులో ఇళ్ల నిర్మాణానికి గానూ 1,521 అనుమతి వచ్చింది. ఇందులో 354 మంది ఇళ్లు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నారు.మిగతావన్నీ వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ముఖ్యంగా క్రోసూరులో 536 పట్టాలిస్తే వాటిలో 253 ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. వీటిల్లో పలువురు పూర్తి చేసుకోగా, మిగతావి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి.

కాలనీల్లో సకల సౌకర్యాలు

మాజీ సీఎంజగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చకచకా సాగాయి. లేఅవుట్ల ప్రకారం రోడ్లు వేశారు. విద్యుత్ స్తంభాలు వేసి, ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేశారు. శ్లాబ్ వేసుకున్న వారందరికీ విద్యుత్ మీటర్లు ఇచ్చారు. వీధుల్లో నీళ్ల ట్యాంకులు కట్టి, బోర్లు, మోటార్లు పెట్టటంతో చాల మంది పేదలు వేగంగా ఇళ్లు కట్టున్నారు. ఏళ్ల తరబడి గూడు లేని పేదలు సొంత ఇల్లు సాకారం చేసుకున్నారు.

సంతోషంగా ఉంది



నాడు సీఎం జగనన్న ప్రభుత్వం స్థలం ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాం. అద్దె ఇళ్ల భారం తప్పింది. సొంతింటిలో ఉండటం మాకు చాలా సంతోషంగా ఉంది.

– కొల్లి మరియరాణి, దొడ్లేరు.

డ్రైయిన్లు నిర్మించాలి



జగనన్న కాలనీల్లో పంచాయతీ అధికారులు మురుగు పారేందుకు డ్రెయిన్లు నిర్మించాలి. మురుగు నిల్వ లేకుండా కాలనీలు పరిశుభ్రంగా ఉంటాయి. డ్రెయిన్ల నిర్మాణంతో కాలనీల్లో దాదాపుగా ఇక ఏసమస్యలుండవు

– మాతంగి దాసు, దొడ్లేరు

ఆర్థిక సాయం పెంచాలి



ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం పెంచాలి. పెరిగిన సిమెంటు, ఐరన్ ధరలతో సామాన్యుడు అవస్థలు పడుతున్నాడు. ఆర్థిక సాయాన్ని పెంచడం వల్ల పలువురు ఇళ్లు కట్టుకునేందుకు అవకాశం ఉంటుంది

– మునుగోటి శ్రీనివాసరావు, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి

ఆరోగ్యమే మహా భాగ్యం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ



ఆరోగ్య దినోత్సవంలో పాల్గొన్న వైద్యాధికారి రమాదేవి, సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పారాలీగల్ వలంటీర్ జక్కుల లక్ష్మీనారాయణ సూచించారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనిషి వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నా దాన్ని అనుభవించేందుకు ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నియమిత ఆహార అలవాట్లను కలిగి, ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, పారాలీగల్ వలంటీర్ షేక్ సుభాని, అసోసియేషన్ సభ్యులు చంద్రయ్య, వెంకటాద్రి, శివశంకరరావు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య నియమాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి. రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ముఖ్యంగా పురుషులు పొగ, మద్యం తాగడం, ఫాస్ట్‌పుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. దురలవాట్ల వల్ల తొందరగా అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలని, రోజులో కనీసం ఏడు గంటలు నిద్రకు కేటాయించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఏ.పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్ రాణి, ఉస్మాన్, దస్తగిరి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు క్రోసూరు జెడ్పీ హైస్కూలులో వైద్య శిబిరం

క్రోసూరు: స్థానిక జెడ్పీ పాఠశాలలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. అత్యాధునిక సౌకర్యం గలిగిన బస్సులో పూర్తి ఎక్విప్‌మెంట్‌తో మెడికల్ టెస్టులు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు శిబిరం జరుగుతుందన్నారు. జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, జనరల్ సర్జన్ విభాగాల వైద్యులు పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి షుగర్, సీబీపీ, రక్తపరీక్ష, ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఫోను నంబర్ తీసుకొని రావాలని సూచించారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

క్రోసూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.వి. నాగరాజు తెలిపారు. ఒకటి ఆర్‌ఓఆర్‌పై, మరొకటి బర్త్ సర్టిఫికెట్ కోసం వచ్చినట్లు ఆయన వివరించారు.

తల్లి మందలించినందుకు కుమార్తె ఆత్మహత్య



సత్తెనపల్లి: కళాశాలకు వెళ్లమని తల్లి మందలించినందుకు కుమార్తె ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తెనపల్లిలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన బలిజేపల్లి సాహితీ (18) శ్రీకాకుళంలో అగ్రికల్చర్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల సత్తెనపల్లి వచ్చిన సాహితీ కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లి సుజాత మందలించింది. కళాశాలకు వెళ్లాలంటే ఫీజు చెల్లించాలని సాహితీ ప్రశ్నించడంతో పంపుతాములే వెళ్లమని తల్లి మందలించింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సాహితీ సమీపంలోని మాస్టిన్‌పేటలోని చిన్నమ్మ గృహంలో ఫ్యాన్ పక్కనే కొక్కెంకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించటంతో వైద్యశాలకు తరలించారు. అప్పటికే విద్యార్థిని సాహితీ మృతి చెందింది. దీనిపై అనుమానాస్పద మృతిగా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నరసరావుపేట: సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బొడ్డు వెంకటేశ్వరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు లైంగిక వేధింపుల సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేపీ మెటిల్డాదేవి, గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు తాత్సారం చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వేధింపులు మరింత ఎక్కువ కావడంతో ప్రజా ప్రతినిధులకు సెల్ఫీ వీడియో విడుదల చేయడం వెనుక పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకోవాలన్నారు. ఇటీవల నకరికల్లు మండలం పాపిశెట్టివారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా బేగం రాజకీయ, లైంగిక వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనను గుర్తు చేశారు. గతంలో వంట గదికి పరిమితమైన మహిళలు సత్తా చాటి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అంగన్‌వాడీ రంగంలో గౌరవ వేతనం తీసుకుంటూ విశేషసేవలు అందిస్తున్న మహిళలను గౌరవించి ప్రోత్సహించాలన్నారు. వెంటనే హోం మంత్రి అనిత స్పందించి ఈ కేసులో విచారణ వేగవంతం చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వేధింపులకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ సుబ్బాయమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చిట్టిబాబు తదితరులు

నరసరావుపేట రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాసిన్ మాట్లాడుతూ బోర్లు మరమ్మతులు పూర్తిచేయడంతో పాటు చెరువులను నీటితో నింపుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం టెండర్ల దశలో ఉందని చెప్పారు. జలజీవన్ మిషన్ పథకంలో నిర్వహిస్తున్న పనులపై జెడ్పీటీసీ సభ్యుడు చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. కనెక్షన్ కోసం మెయిన్ పైప్ నుంచి కుళాయి ఇచ్చే పైప్ చిన్నదిగా ఉండటంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిపారు. దీంతో పాటు ఆయా పనుల కోసం తవ్విన గుంతలను కాంట్రాక్టర్లు వెంటనే పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సత్వరం చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.3 కోట్ల పనులకు టెండర్లు పూర్తచేసినట్టు తెలిపారు. బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏవో సురేంద్రబాబు, ఏపీవో కోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ నాగానంద్ పాల్గొన్నారు.

విద్యకు పేదరికం అడ్డుకాదు

రాజ్యసభ మాజీ సభ్యుడు రవీంద్రకుమార్



శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న రవీంద్రకుమార్

అమరావతి:విద్యకు పేదరికం అడ్డుకాదని, ప్రతి విద్యార్థి పట్టుదల, అంకితభావంతో చదివితే బంగారు భవిష్యత్ సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ తెలిపారు. స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సోమవారం రూ. 33లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆళ్లగడ్డ సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ అమరావతి ప్రాంతంలో పేద విద్యార్థులకు ఉచితంగా 75 సంవత్సరాల నుంచి బోధన చేస్తున్న శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌కు సాయ మందించడం ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర కలిగిన శ్రీరామకృష్ణ హైస్కూల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో సిబ్బంది కొరత, ఇంటర్మీడియట్ విద్య ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, పాఠశాల కార్యవర్గ అధ్యక్షుడు వజినేపల్లి శేఖర్, కార్యవర్గ సభ్యులు మల్లెల హరీంద్రనాథ్‌చౌదరి, పారేపల్లి సత్యనారాయణ, కొల్లి లక్ష్మీనారాయణ, మంగిశెట్టి వెంకటకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు మాజేటి రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ తరగతులు ప్రారంభం



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయినులు

నకరికల్లు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రవేశానికి గాను దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 11వ తేదీ వరకు మాత్రమే అవకాశముందని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులను సోమవారం ప్రారంభించారు. విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, రెండవ సంవత్సరం ఎంపీసీలో ఆరు సీట్లు, 10వ తరగతిలో ఒక సీటు, ఆరవ తరగతిలో 40 సీట్లు భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. నాణ్యమైన భోజనం, ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. డ్రాపౌట్స్, తల్లిదండ్రులు లేని పిల్లలు, అనాథలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ జోతిర్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ సంవత్సరం చదువుతున్న 36 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్‌లో, 7,8,9,10వ తరగతులలో చేరే విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

టీడీపీ నేతను కఠినంగా శిక్షించాలి

సీఐటీయూ మండల కార్యదర్శి పెండ్యాల మహేష్

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లి అంగన్‌వాడీ కార్యకర్తకు పదేపదే ఫోన్ చేసి కోరిక తీర్చమంటూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్న టీడీపీ నేత, దురంహకారి బొడ్డు వెంకటేశ్వరరావును కఠినంగా శిక్షించాలని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు రిజిస్ట్రేషన్ లేకుండా పౌష్టికాహారం ఇవ్వాలంటూ హుకుం జారీ చేయడం దుర్మార్గమని తెలిపారు. "మీరు దళితులు.. మా పార్టీ అధికారంలో ఉంది.. నన్నేమీ చేయలే"రంటూ అంగన్‌వాడీ కార్యకర్తకు వార్నింగ్ ఇవ్వడం సిగ్గుచేటని ఖండించారు. అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. బాధితురాలను హోం మంత్రి పరామర్శించి భరోసా ఇవ్వాలని, లేనిపక్షంలో అంగన్‌వాడీలను ఏకం చేసి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తకు యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు.

స్కూల్ తరలింపు యోచనతో విద్యార్థులకు అవస్థలు



ఎంఈఓ-2 రాఘవేంద్రరావుకు వినతి పత్రం అందిస్తున్న నందిగామ ఎస్సీ కాలనీ వాసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్(ఎల్ఈ) పాఠశాల తరలింపు ప్రయత్నం మానుకోవాలని నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాశాఖ అధికారి-2 ఏ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని స్కూలును ఓసీ కాలనీకి తరలించడానికి కూటమి ప్రభుత్వంలోని నాయకులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ కాలనీలో ఒకటో తరగతి, రెండో తరగతి మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారన్నారని, అంగన్‌వాడీ కేంద్రంతో కలిసి మొత్తం పిల్లలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అదీ కాకుండా 15 మంది ఉన్న ఓసీ కాలనీ ఎంపీపీఎస్(హెచ్ఈ) స్కూల్‌కి పంపించాలని ఎస్సీ కాలనీవాసులను టీడీపీ మండల కన్వీనర్ ఆళ్ల అమరేశ్వరరావు బెదిరిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విద్యార్థి కమిటీ, తల్లిదండ్రులు కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



నాగిరెడ్డిపాలెంలో బోర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో, నాయకులు

బెల్లంకొండ: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎంపీడీఓ వై. హనుమారెడ్డి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన బోరును స్థానిక నాయకులతో కలసి ఎంపీడీవో ప్రారంభించారు. కాలనీ ప్రజలు నీటి అవసరాల కోసం ఇబ్బందుల పడుతుండడంతో బోరును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుని పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, ఈవోపీఆర్డీ వెంకట గిరిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ వసంతరావు, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక



తులసీ తన్మయ్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని వి.తులసీతన్మయ్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్.సుధీర్, సోమవారం తెలిపారు. తెనాలిలో ఈనెల 2, 3తేదీల్లో నిర్వహించిన 5వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడేట్ అండ్‌తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలో తులసీతన్మయ్ 49కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు వివరించారు.

ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచాయి. అన్ని గ్రామాల్లో ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు గంట పాటు ఈ పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులు తగ్గినప్పటికీ విద్యుత్ సరఫరా జరగలేదు. పిడుగుర్లా ప్రాంతంలో వర్షంతో కూడిన ఈదురు గాలులు వీచటం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిసింది. అయితే మండలంలో రాత్రి నెలకొన్న వాతావరణ పరిస్థితులకు వర్షం పడుతుందని ప్రజలు ఊహించారు. ఈదురు గాలుల వల్లే వర్షం కురియలేదని అభిప్రాయపడ్డారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు తగ్గిన తర్వాత కొన్ని ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు ఎగిరిపోవటంతో లైన్‌మెన్‌లో వాటిని సరిచేసే ప్రయత్నాలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బలమైన ఈదురు గాలులకు తేలికపాటి వస్తువులు కొట్టుకుపోయాయి. ఎక్కడా ఆస్తినష్టం జరిగినట్లుగా సమాచారం లేదు.